క్లుప్తంగా

నవధాన్యాల సాగుపై అవగాహన



నవధాన్యాలు సాగును వివరిస్తున్న శివానందం

కంచిలి: సేంద్రియ పద్ధతిలో నవధాన్యాలు సాగుచేయడం ద్వారా రైతుకు ఎన్నో ప్రయోజనాలున్నాయని ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ టి.శివానందం అన్నారు. మండలంలోని జాడుపూడి గ్రామంలో నవధాన్యాల కిట్స్ తయారీపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. నవధాన్యాల సాగుతో మొక్కకు కావల్సిన 59 రకాల పోషకాలు అందుతాయన్నారు. కలుపు కూడా పూర్తిగా నివారణ అవుతుందన్నారు. ఐసీఆర్‌పీలు శీర కామరాజు, డి.శ్రీదేవి, లీడ్ ఫార్మర్లు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థినికి సత్కారం



నవధాన్యాలు సాగును వివరిస్తున్న శివానందం

కాశీబుగ్గ: పలాస మండలం కేదారిపురం పంచాయతీ గంగువాడ గ్రామానికి చెందిన వట్టికూళ్ల జ్యోతిక ఇంటర్మీడియెట్ ఫలితాల్లో వెయ్యికు 986 మార్కులు సాధించింది. దీంతో మాజీ సైనికులు ఆసపన్న బాలరాజు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో జ్యోతికను దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పైల మాధవరావు, అగ్గున్న క్రిష్ణారావు, వట్టికూళ్ల రామ్‌కుమార్, ఆసపన్న లోకనాథం, ఆసపన్న నారాయణరావు, పద్మ సంతోష్, తాడేల మోహన్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా మజ్జి గౌరమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజలందుకున్న మజ్జి గౌరమ్మ

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి నర్సిపురం కాలనీలోని మజ్జి గౌరమ్మతల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలు, అభిషేకాలు అర్చనలు, అన్నదాన కార్యక్రమం జరిగింది. సాయంత్రం భజన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కృష్ణ, శోభారాణి, బాలేశ్వరి, పార్వతి,కృష్ణవేణి, సంగీతతో పాటునర్సిపురం కాలనీ వాసులు పాల్గొన్నారు.

దేవాలయ పునః నిర్మాణ పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న నాయకులు

సోంపేట: బారువ గ్రామంలోని పురాతన దేవాలయం కోటిలింగేశ్వర స్వామి ఆలయ పునఃనిర్మాణ పనులను ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ ఆదివారం పరిశీలించారు. దేవాలయ విశిష్టతను దృష్టిలో ఉంచుకుని పనులు పూర్తి చేయాలని దేవాలయ నిర్మాణ కళాకారులకు సూచించారు. వైస్ ఎంపీపీ గురాల శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు తామాడ బుజ్జి, మాధవరావు ఉన్నారు.

నవధాన్యాల సాగుతో భూమికి సారవంతం

కవిటి: వ్యవసాయ క్షేత్రాలలో నవధాన్యాల సాగు ద్వారా భూమి సారవంతంగా మారుతోందని వ్యవసాయ సిబ్బంది అన్నారు. గొర్లపాడు గ్రామంలో నవధాన్యాల సాగు–నేల తల్లికి బాగు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నవధాన్యాల కిట్లను రైతులకు అందజేశారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఎస్‌ఎఫ్‌ఏ గోవింద్, ఎంటీ దుర్గాప్రసాద్, డీఎంఎంటీ తులసయ్య, కుమారి, చిట్టిబాబు, కామరాజ్, శ్రీదేవి, సంతోషి, స్వాతి పాల్గొన్నారు.

సామాన్యుడిపై గుదిబండ!

- పేద ప్రజలపై గ్యాస్ ధరా భారం
- సిలిండర్‌పై అదనంగా రూ. 50 పెంపు

ఇచ్ఛాపురం రూరల్:

సామాన్య, మధ్య తరగతి కుటుంబాల వంటింట్లో కూటమి ప్రభుత్వం మళ్లీ మంట పెట్టింది. కొన్ని రోజులుగా వాణిజ్య సిలిండర్ ధరలను పెంచుకుంటూ వస్తున్న ప్రభుత్వం తాజాగా గృహ వినియోగదారులకు వాత పెట్టింది. పేద, సామాన్య కుటుంబాలకు గ్యాస్ ధర గుదిబండగా మారింది. ఇప్పటికే విద్యుత్, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న సామాన్యుడిపై మరో భారం పడింది. గృహ వినియోగ సిలిండర్ ధర రూ. 840 ఉండగా, తాజాగా కేంద్రం మరో రూ.50 పెంచింది. దీంతో పేద వర్గాల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఇండియన్, భారత్, హెచ్‌పీ గ్యాస్ కంపెనీలకు చెందిన ఏజెన్సీలకు సంబంధించి సుమారు 95,530 కనెక్షన్‌లు ఉన్నాయి. సగటున ఒక కుటుంబానికి ఏడాదికి ఆరు నుంచి పది సిలిండర్ల వరకు వినియోగిస్తుంటారు. ఈ లెక్కన ప్రతి కుటుంబానికి ఏడాదికి సుమారు రూ. నాలుగు వందల వరకు అదనపు భారం పడుతుంది. ఈ ధరల పెంపుతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. ఉజ్వల పథకం లబ్ధిదారులపై కూడా ప్రభుత్వం కనికారం చూపలేదు. వారికి కూడా ఈ పెంపు వర్తింపజేసింది. ఇకపై ప్రతీ 15 రోజులకు లేదా నెలకు ఒకసారి ధరలపై సమీక్షిస్తామని ప్రకటించడంతో భవిష్యత్తులో గ్యాస్ ధర మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయనే సాంకేతాలు ఇచ్చినట్లు ఉందని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.





వినియోగదారులకు సరఫరా చేసేందుకు సిలిండర్లను వ్యాన్‌లో తరలిస్తున్న దృశ్యం

పేదలపై అదనపు భారం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంటు బిల్లులు, నిత్యవసరాల ధరలు తగ్గిస్తామని చెప్పిన నాయకులు అధికారంలో వచ్చిన వెంటనే ట్రూ ఆప్ చార్జీల పేరిట ఇష్టానుసారంగా విద్యుత్ బిల్లులు పెంచేయడంతో బిల్లులు చూస్తే షాక్ కొడుతున్నాయి. అదే సమయంలో ఎన్నికలకు ముందు గ్యాస్ ధరలను స్వలంగా తగ్గించిన కేంద్ర ప్రభుత్వం ఆ తర్వాత పెంచడంతో పేదలపై అదనపు భారం పడుతోంది. కేంద్ర ప్రభుత్వం తీరుపై వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ధరలను నియంత్రించాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలి



సామాన్యులపై ప్రభుత్వం ఇప్పటికే విద్యుత్ చార్జీలతో పాటు అనేక భారాలు మోపింది. డీజిల్, పెట్రోల్ ధరలు పెరగడంతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా విపరీతంగా పెరగడానికి కారణమయ్యాయి. ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఇలా ధరలు పెంచి సామాన్య, మధ్య తరగతి కుటుంబాలపై భారం మోపుతోంది. పెంచిన ధరలను తగ్గించాలి.

– కారంగి మోహనరావు, మాజీ ఎంపీపీ, ఇచ్ఛాపురం

పేదలపై అదనపు భారం



ఎన్నికలకు ముందు ధరలు తగ్గిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని రకాల ధరల పెంపుతో పేద ప్రజల నడ్డి విరిచింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఉపాధి లేక ప్రజలు అల్లాడుతున్నారు. ఇప్పటికే కరెంటు చార్జీలు పెంచడం, కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచడంతో అదనపు భారంగా మారింది. ప్రభుత్వం తక్షణమే పెంచిన ధరలను తగ్గించాలి

– ఆశి పురుషోత్తమరెడ్డి, జగన్నాథపురం, ఇచ్ఛాపురం మండలం

వీర సైనికులకు జోహార్లు



మౌనం పాటిస్తున్న మాజీ సైనికులు

ఇచ్ఛాపురం: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్‌తో చేస్తున్న యుద్ధంలో అమరులైన వీరజవాన్ల ఆత్మకుశాంతి చేకురాలని ఇచ్ఛాపురం మాజీ సైనిక ఉద్యోగుల సంఘం సభ్యులు అంజలి ఘటించారు. మాజీసైనిక ఉద్యోగుల సంఘం కార్యాలయం వద్ద ఆదివారం సాయంత్రం అధ్యక్షులు కె.రామకృష్ణ ఆధ్వర్యంలో వీరజవాన్ల ఆత్మకు శాంతిచేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో మాజీ సైనికులు ఎల్.ఆర్.రెడ్డి, బి.ఎల్.నారాయణ, డి.విశ్వనాథ్‌రెడ్డి, యు.శంకర్‌రెడ్డి, ఎస్.ఎస్.పట్నాయక్, మదన్‌మోహన్, ఎం.సాహు, మాధవరెడ్డి, ఈశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా రామకృష్ణ మందిరం వార్షికోత్సవం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సేవాసమితి ప్రతినిధులు

సోంపేట: సోంపేట పట్టణంలోని రామకృష్ణ మందిరం 26వ వార్షికోత్సవాన్ని రామకృష్ణా సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ పరమహంస, శారదాదేవి, వివేకానందునికి ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వేసవి సెలవుల సందర్భంగా పిల్లల కోసం భరత నాట్యం, కోలాటం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సేవాసమితి ప్రతినిధులు గరుడాచలం శంకరరావు, రెల్ల నారాయణరావు, పాడుగు కామేష్, దుద్ది రాజు పాల్గొన్నారు.

రెండు దశాబ్దాల తరువాత ఒకే వేదికపై..



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

కాశీబుగ్గ: చినబడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002–03లో విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడిలో వీరమరణం పొందిన జవాన్లకు జోహార్లు పలికి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తమతో పాటు చదువుకున్న ఆరుగురు స్నేహితులు చనిపోవడంతో వారికి కూడా సంతాపం తెలియజేశారు. విద్యా బుద్ధులు నేర్పిన గురువులను దుశ్శాలువలతో సత్కరించి గౌరవించారు. 22 ఏళ్ల అనంతరం కలిసిన పూర్వ విద్యార్థులు ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకొని ఆనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. గ్రూపు ఫొటోలను తీసుకొని మురిసిపోయారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధి కోసం రూ. 50 వేలను వితరణ చేశారు.

కవిటి: రాజపురం జెడ్పీ బాలుర హైస్కూల్‌లో 2002–03 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. చదువు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులకు పాదపూజ చేసి దుశ్శాలువలతో సత్కరించి గౌరవించారు.



కవిటి: ఆనందంలో పూర్వవిద్యార్థులు

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



రోడ్‌సేఫ్టీ మిర్రర్లను ప్రారంభిస్తున్న సీఐ చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: ప్రయాణాలు చేసేటప్పుడు ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ఇచ్ఛాపురం సీఐ మీసాల చిన్నంనాయుడు అన్నారు. పట్టణానికి అనుసంధానంగా ఉన్న బెల్లుపడ రోడ్డులోని మూడు జంక్షన్‌లో జేసీఐ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేఫ్టీ మిర్రర్లను ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. జేసీఐ సభ్యులు వెచ్చా రాము వీటిని సమకూర్చారు. కార్యక్రమంలో జేసీఐ అధ్యక్షులు కె.జయదేవ్, సభ్యులు మోహన్, పవన్, షణ్ముఖ, స్వరూప్, సంతోష్, శ్యామ్, మట్ట శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి రౌతుపోలమ్మ ఉత్సవాలు

సోంపేట: పాలవలస గ్రామంలోని రౌతుపోలమ్మ తల్లి గ్రామదేవత ఉత్సవాలు సోమవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. తొమ్మిది రోజుల పాటు పగటి వేషాలతో అమ్మవారి తిరువీధులు, రోజూ రాత్రి వేళ టీవీ కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా మదర్స్ డే



కంచిలి: వృద్ధ మహిళలను సత్కరిస్తున్న రమేష్

కంచిలి: మండపల్లి గ్రామంలోని సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థాశ్రమంలో మాతృ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలో ఉన్న వృద్ధ మహిళలకు ఆశ్రమ వ్యవస్థాపకుడు గుళ్ల రమేష్ ఆధ్వర్యంలో చీరలను అందజేసి ఘనంగా సత్కరించారు. వారి ఆశీర్వాదాలను తీసుకున్నారు.

చర్చిలో వేడుకలు..

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డు చినబడం పాత జాతీయ రహదారి పక్కన ఉన్న క్రిస్టియన్ ప్రెయిర్ టెంపుల్‌లో మదర్స్ డేను జరుపుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరంకేక్ కట్ చేసి పంచిపెట్టారు. అమ్మ పాటలకు ప్రత్యేక నృత్యాలు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో..

కవిటి: రామయ్యపుట్టుగ, ఎర్రగోవిందపుట్టుగ, బొరివంక–2 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆదివారం మాతృదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా అంగన్‌వాడీల్లోని చిన్నారులతో వారి తల్లులకు పాదపూజ చేయించి తల్లి గొప్పతనాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో పలు పోటీలు నిర్వహించి చిన్నారులకు మిఠాయి పంచిపెట్టారు.



కవిటి: ఎర్రగోవిందపుట్టుగ అంగన్‌వాడీ కేంద్రంలో వేడుకలు



కాశీబుగ్గ: వేడుకల్లో మాతృమూర్తులు



క్రీడా పోటీల్లో ఈదుపురం క్రండవార్డు మహిళలు

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం గ్రామంలో మదర్స్‌డే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. క్రండవార్డు యూత్ ఆధ్వర్యంలో మహిళలకు వివిధ క్రీడా పోటీలను ఏర్పాటు చేశారు. అనంతరం తల్లులను సత్కరించారు. క్రండవార్డు యూత్ హంగిర్ బెహర, ఇంగిచ్‌బెహర, సోమేష్, మహిళలు హాజరయ్యారు.

విష్ణుసహస్రనామ పూజలు



పూజల్లో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ తదితరులు

ఇచ్ఛాపురం టౌన్: మున్సిపాలిటీలోని పురుషోత్తపురంలో విశ్వశాంతి మహాయజ్ఞం వైభవంగా జరుగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం విష్ణు సహస్రనామ, సూర్య, తులసీ, మండపం పూజలతో పాటు గోపూజ, ఘృత యజ్ఞం నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్, మున్సిపాలిటీలోని భక్తులు పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు.

నలుగురు అరెస్టు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలోని పొందరవీధి సమీపంలో పొలాల్లో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పట్టణ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఈ విషయాన్ని పట్టణ ఎస్సై ముఖుందరావు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 1840లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై తెలిపారు.

తండ్రిపై తనయుడు దాడి

ఇచ్ఛాపురం: పట్టణానికి చెందిన బంగారు వ్యాపారి వెచ్చా కేశవరావుపై అతని కుమారుడు చలమాజి దాడిచేశాడు. ఈ ఘటనపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని ఎస్సై ముఖుందరావు ఆదివారం తెలిపారు. చిన్నమేదర వీధికి చెందిన బంగారు వ్యాపారికి అతని కుమారుడుతో రథంవీదిలో ఉన్న ఒక బంగారు దుకాణానికి సంబంధించి గొడవ మొదలైంది. ఈ క్రమంలో అతని కుమారుడు తండ్రిపై చైర్‌తో దాడిచేసి తోసివేడంతో తలకు తీవ్రగాయమైంది. ఈ విషయమై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేయగా పట్టణ ఎస్సై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వ్యాపారికి చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి పోలీసులు తరలించారు.

కళా కిరీటి పురస్కారాలు ప్రదానం



ఆంధ్ర స్టాలిన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

టెక్కలి రూరల్: ఏలూరులోని ఓ కల్యాణ మండలంలో ఈ నెల 10, 11 తేదీల్లో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న కళాకారులను నిర్వాహకులను సత్కరించి గౌరవించారు. ఇందులో భాగంగా టెక్కలికి చెందిన ప్రజా చైతన్య కళా సమితి ప్రతినిధి దూసి ఆంధ్ర స్టాలిన్, మూల తాతయ్యలను కళా కిరీటి పురస్కారాలతో సన్మానించారు. కళాసమితి ప్రతినిధులు హర్షం వ్యక్త చేశారు.

రూ. 51 వేల ఆర్థికసాయం



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ సూదికొండ ప్రాంత్రానికి చెందిన బుట్ట గంగాధర్ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోగా భార్య సరళ తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమైంది. దీంతో ఈ కుటుంబు ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటుంది. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న పూండికి చెందిన యువతరం సేవా సమితి సభ్యులు రూ. 51 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని చెక్ రూపంలో సరళకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు చింత మురళి, సోషల్ మీడియా ఇన్‌చార్జి గోరకల సునీల్, ఇన్‌చార్జిలు కర్ని నారాయణ, గున్న వెంకటరమణ, అన్నెపు లక్ష్మణరావు, గర్తం పుష్ప, స్ఫూర్తి సేవా సంస్థ అధ్యక్షులు కెంగువ రాంబాబు, ఉత్తరాల బాలరాజు, సైని హేమరావు పాల్గొన్నారు.

–కాశీబుగ్గ

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



పలాస మండలం టిక్కలి పట్నంలో లక్ష్మీనరసింహ స్వామి జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్వామివారి జయంతి మహోత్సవాన్ని పురస్కరించుకొని విశేష అభిషేకాలు, స్వామి వారి కల్యాణం, మూలమంత్ర సహస్ర హోమం నిర్వహించారు. కన్నబాబు దంపతులు, తిప్పన మోహనరావు, గ్రామ పెద్దల సమక్షంలో కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ పాలిన క్రిష్ణ, దేవదాయ ధర్మాదాయశాఖ అర్చకులు సంతోష్‌కుమార్ పండా, లోకనాథం పండా, సింహాచలం పండా పర్యవేక్షించారు.

–పలాస

ఉచిత వైద్యశిబిరం



కంచిలి మండలం డోలగోవిందపురం గ్రామంలో శ్రీకాకుళానికి చెందిన సేవాభారతి, నేషనల్ మెడికల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఇందులో 11 మంది వైద్యనిపుణులు 80 మంది రోగుల్ని పరీక్షించి, అవసరమైన మందుల్ని పంపిణీ చేశారు. శిబిరాన్ని స్థానిక సర్పంచ్ హృషికేష్ పాత్రో తదితరుల చేతులమీదుగా భరతమాతకు పూజలు చేయడంతో ప్రారంభించారు.

–కంచిలి

టెక్కలిపట్నం రోడ్డు..
నరకయాతన!

- శిథిలమైన పలాస–పర్లాకిమిడి రహదారి
- అవస్థలు పడుతున్న వాహనాదారులు



టెక్కలిపట్నం వద్ద రోడ్డు దుస్థితి

పలాస: పలాస మండలంలోని టెక్కలిపట్నం ప్రధాన రహదారి ప్రయాణికులకు నరకాన్ని చూపిస్తోంది. పాదచారుకులు కూడా నడవలేని దుస్థితిలో ఉంది. పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో వాహనదారుల అవస్థలు అన్నీఇన్నీకాదు. ఎంతో ప్రాధాన్యం ఉన్న రోడ్డును కూటమి ప్రభుత్వం విస్మరించిందనే విమర్శలు వస్తున్నాయి. ఈ రహదారి గుండానే పలాస నుంచి ఒడిశాలోని పర్లాకిమిడికి బస్సులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రోజుకు పాతికపైగానే బస్సులు నడుస్తున్నాయి. ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు బస్సుల్లో వందలాది మంది ప్రయాణాలు చేస్తున్నారు. ఆటోలు కూడా అధిక సంఖ్యలో తిరుగుతుంటాయి. ఇంత రద్దీగా ఉన్న ఈ రహదారి నిర్లక్ష్యానికి గురై వాహనదారులకు నరకాన్ని చూపిస్తుంది. గజానికో గుంతతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చొరవతో ఈ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. దీంతో రోడ్డు పనులు ప్రారంభించారు. ఓ వైపు కల్వర్టు నిర్మిస్తూ మరో వైపు రహదారి వెడాల్పు పనులు చేపట్టారు. ఈ క్రమంలోనే ఎన్నిక కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి. బెంగి గేటు వద్ద ప్రారంభమైన పనులు టెక్కలిపట్నం వరకు చేరాయి. అయితే పంచాయతీ కేంద్రమైన టెక్కలిపట్నం వద్ద పనులు నిలిచిపోయాయి. వజ్రపుకొత్తూరు, పలాస మండలాలకు ముఖ్యకూడలిగా ఉన్న ఈ గ్రామం మెయిన్ రోడ్డులో గుంతలు కూడా కనీసం పూడ్చకపోవడంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, కూటమి నాయకులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



టెక్కలిపట్నం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పరిస్థితి ఇలా..